క్లుప్తంగా

దిష్టిబొమ్మల దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

పార్వతీపురం: నేషనల్ హెరాల్డ్ కుంభకోణానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీల దిష్టిబొమ్మలను బీజేపీ నాయకులు పట్టణంలో శుక్రవారం దహనం చేశారు. భారతీయ జనతా యువ మోర్చా జాతీయ శాఖ, రాష్ట్ర యువమోర్చా అధ్యక్షుడు మిట్ట వంశీకృష్ణ పిలుపు మేరకు నిరసన కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ నాయకుల దిష్టిబొమ్మలను దహనంచేసి నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎస్.శ్రీనివాసరావు, తిరుపతి, హరీష్‌రావు, సురేష్, రాము, చంద్రమ్మ, కనకరావు తదితరులు పాల్గొన్నారు.

విరిగి పడిన కరెంట్ పోల్



రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన కరెంటు పోల్

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లిలో శుక్రవారం సాయంత్రం కురిసిన గాలి, వర్షానికి గ్రామసమీపంలో భారీ వృక్షం విరిగి పక్కనే ఉన్న కరెంటు పోల్‌పై పడడంతో పోల్ విరిగిపోయింది. దీంతో రోడ్డుపై కొంత సమయం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వెంటనే విద్యుత్ అధికారులు పనులు ప్రారంభించి కొత్తపోల్ వేశారు. విద్యుత్‌లైన్ కలిపేందుకు చర్యలు చేపట్టారు.

ఉపాధి కూలీల వేతనం వెంటనే చెల్లించాలి



నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

సాలూరు రూరల్: మండలంలోని ఉపాధి కూలీలకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీను డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని నెలిపర్తి గ్రామంలో పెదవెంకన్న చెరువు బొడ్డల బందలో ఉపాధి పనులు పరిశీలించిన వ్యవసాయ కూలీ సంఘం నాయకులు కూలీలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కూలిడబ్బులు వెంటనే చెలించడంతోపాటు రెండవపూట పూట పని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. సంవత్సరంలో రెండువందలరోజులు పని కల్పించడంతో పాటు కూలి రూ.600 కు పెంచాలని, లేదంటే పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

సాకిగెడ్డ పరిసరాల్లో చెక్‌డ్యామ్ నిర్మించాలి

పార్వతీపురంటౌన్: సాకిగెడ్డ పరిసర ప్రాంతంలో చెక్‌డ్యామ్ నిర్మించాలని తాళ్లబురిడి గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ చెక్‌డ్యామ్ నిర్మించడం వల్ల సాగు పొలాలకు నీరు అందుతుందని, పంటలు పండుతాయని తెలిపారు. సుమారు 300 ఎకరాల పొలాలకు ఈ గెడ్డద్వారా నీరు అందుతుందని, చెక్‌డ్యామ్ లేకపోవడం వల్ల సాగునీరు సమయానికి అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నియామక పత్రాల అందజేత

సాలూరు: నియోజకవర్గంలో ఇటీవల అంగన్వాడీ సిబ్బంది నియమితులైన నేపథ్యంలో వారికి స్త్రీశిశుసంక్షేమం, గిరిజన సంక్షేమశాఖమంత్రి గుమ్మడి సంధ్యారాణి నియామకపత్రాలను అందించారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని ఆమె గృహం వద్ద వాటిని అందించారు.

మట్టికుండతో గట్టిమేలు



సంతలో విక్రయానికి సిద్ధంగా ఉన్న కుండలు

బలిజిపేట:

భానుడు భగ్గుమంటున్నాడు. మండే ఎండలతో ప్రతాపం చూపిస్తున్నాడు. ఎండలు తరుముకొస్తున్న తరుణంలో వేసవి తాపం కారణంగా ఉపశమనం కోసం చల్లని తాగునీటి కోసం జనం తహతహలాడుతుంటారు. పేదోడి ఫ్రిడ్జ్‌గా మట్టి కుండలకు డిమాండ్ ఉంది. అయితే చాలామంది ప్రకృతి ప్రేమికులు ఫ్రిడ్జిలో నీటి కంటే మట్టి కుండలో నీటినే తాగుతుంటారు. ఇది ఆరోగ్యానికి కూడా మంచిది కావడంతో కుండలకు గిరాకీ ఎక్కువ. ఎండల తీవ్రత ఒక్కసారిగా పెరగడంతో మార్కెట్‌లో మట్టి కుండల విక్రయాలు ప్రారంభమయ్యాయి.

సైజును బట్టి ధర:

ఒక్కో కుండ ధర దాని సైజును బట్టి ఉంటుంది. గ్రామీణ ప్రాంతంలో మట్టితో తయారుచేసిన కుండలనే విక్రయిస్తుంటారు. సుమారు ఒక్కో కుండ రూ.100ఉండవచ్చు.

మట్టి కుండతో ప్రయోజనాలు

మట్టిలో ఎన్నో మినరల్స్, సాల్ట్స్ ఉంటాయి. అలాగే అందులో ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ ఎనర్జీ దాగిఉంటుంది. మట్టితో తయారుచేసిన కుండలో నీటిని నిల్వ చేయడం వలన ఆ గుణాలన్నీ ఆనీటిలో చేరతాయి. ఆ నీటిని తాగడం వల్ల వేసవిలో మనం కోల్పోయిన శక్తిని తిరిగి పొందవచ్చు. వేసవిలో ఎక్కువగా ఇబ్బంది పెట్టేది డీహైడ్రేషన్ సమస్య. మట్టి కుండలో నీరు తాగితే శరీరం డీహైడ్రేట్ కాకుండా జాగ్రత్త పడవచ్చు. కుండలో నీటిని తాగితే శరీరంలోని గ్లూకోజ్ స్థాయిని అదుపులో ఉంచి వడదెబ్బ నుంచి మనల్ని కాపాడుతుంది. వేసవిలో కొంతమందిలో జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తుతుంటాయి.

వేసవిలో కుండలో నీరే తాగుతాం

> వేసవి వచ్చిందంటే తప్పనిసరిగా కుండలు కొని వాటికి చుట్టూ గోనె, బట్ట ఏదైనా చుట్టి దానిని చల్లబరుస్తూ ఉంచి కుండలో నీరే తాగుతాం. దీనివల్ల దాహం తీరుతుంది. చల్లగా ఉంటుంది. ఫ్రిడ్జ్‌లో నీరు తాగడం వల్ల అనారోగ్యం కలుగుతుంది. కావున కుండలో నీటిని తాగుతున్నాం.
>
> – సత్యనారాయణ, పెదపెంకి, బలిజిపేట మండలం

పేదోడి ఫ్రిజ్ కొనేవారేరీ?

కుమ్మర్లు తయారుచేసే కుండలను కొనేవారు కరువయ్యారు. ఎన్ని ప్రయోజనాలు ఉన్నప్పటికీ సాధారణంగా జీవించేవారి ఇళ్లలో సైతం ఎలక్ట్రానిక్ ఫ్రిడ్జిలే కనిపిస్తున్నాయి. కులవృత్తులకు పనిలేకుండా పోతోంది. గతంలో ప్రతి గ్రామంలో కుమ్మర్లు మట్టితో కుండలు, కుండీలు, కూజాలు, ప్రమిదలు, పొయ్యిలు తయారు చేసి ఊరూరా విక్రయించేవారు. ప్రస్తుత పరిస్థితుల్లో వేసవిలో కుండలు వినియోగించేవారే తక్కువవుతున్నారు.

టీఏల కొలతల ప్రకారమే మట్టి పనులు



టీఏలు ఇచ్చిన కొలతలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు

సీతానగరం: మండలంలో ఉపాధిహామీ పథకం ద్వారా పనులు చేస్తున్న వేతనదారులు టెక్నికల్ సహాయకులు నిర్దేశించిన కొలతల ఆధారంగా పనిలో పాల్గొని సమయ పాలన పాటించాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. ఈ మేరకు గ్రామాల్లో వేతనదారులకు చెరువుల్లో ఎంతమందితో ఎంతదూరంలో ఎంతలోతులో పని చేయాలో టెక్నికల్ సహాయకులు ఇచ్చిన కొలతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులు పనులు చేయడంలో మెలకువలు పాటించాలని కోరారు. అలాగే జాబ్‌కార్డులున్న వేతనదారులందరికీ ఉపాధి పనులు కల్పించనున్నామన్నారు. మేట్‌లందరూ నిర్దేశించిన సమయానికే మస్తరు వేయాలని సూచించారు. కార్యక్రమంలో టీఏలు, క్షేత్రసహాయకులు, మేట్‌లు పాల్గొన్నారు.

అర్ధాంతరంగా నిలిచిపోయిన పీహెచ్‌సీ నిర్మాణం



అర్ధాంతరంగా నిలిచిపోయిన ఆస్పత్రి నిర్మాణం



పాడుబడిన పాత మామిడిపల్లి పీహెచ్‌సీ భవనం

- పట్టించుకోని ప్రభుత్వం

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి పీహెచ్‌సీ పాతభవనం శిథిలావస్థకు చేరుకోవడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర కొత్త పీహెచ్‌సీ భవన నిర్మాణానికి రూ.181.11 లక్షల నిధులు మంజూరు చేయించి నూతన భవన నిర్మాణం ప్రారంభించారు. అయితే పనులు జరుగుతుండగా ఎన్నికలు సమీపించడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో మంజూరైన అభివృద్ధి పనులు మండలంలో చాలావరకు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అందులో మామిడిపల్లి పీహెచ్‌సీ భవనం ఒకటి. అయితే పాతభవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో వర్షం పడితే కారిపోయే పరిస్థితి నెలకొంది. అలాగే పాత భవనంలో రోగులకు గది కూడా ఒకటి మాత్రమే ఉంది. సీజనల్ వ్యాధుల సమయంలో ఈ ఆస్పత్రిలో ఒకే మంచంపై ముగ్గురు వరకు పేషెంట్లు ఉండాల్సి వస్తోంది. ముఖ్యంగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు సీజనల్ జ్వరాలు వచ్చినప్పుడు ఈ ఆస్పత్రిలో ఒకేసారి పదుల సంఖ్యలో విద్యార్థులు వైద్య సేవలు పొందుతుంటారు. గిరిజన ప్రాంతంలో అత్యవసరంగా పూర్తిచేయాల్సిన పనులను నిర్లక్ష్యం చేస్తున్నారన్న ఆరోపణలకు ఈ ఆస్పత్రి పనులు పట్టించుకోకపోవడమే ఉదాహరణగా చెప్పవచ్చు.

పాత భవనం పక్కనే చెత్తకుప్పలు

మామిడిపల్లి పీహెచ్‌సీ వెనుకభాగంలో గ్రామంలో సేకరించిన చెత్త వేసేందుకు డంపింగ్ యార్డుగా వాడుతున్నారు. ఊరిలో ఉన్న చెత్తను సేకరించి పోగులు వేయడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను తగులబెడుతున్నారు. దీంతో ఆ వ్యర్థాల నుంచి వచ్చే పొగ రోగులకు ఇబ్బందికరంగా ఉంటోందని అక్కడ పనిచేస్తున్న డాక్టర్లు సైతం చెబుతున్నారు. అయినా చెత్తను ఆస్పత్రి వెనుకభాగంలో వేయడం మానడం లేదని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికైనా రోగులకు సేవలందించే ఆస్పత్రుల నిర్మాణాలు పూర్తిచేయాలని పలువురు కోరుతున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సూపరింటెండెంట్ బాబురావు

పార్వతీపురంటౌన్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని తపాలాశాఖ డివిజన్ కార్యాలయం సూపరింటెండెంట్ రెడ్డి బాబూరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం తపాలాశాఖ పార్వతీపురం డివిజన్ పరిధిలోని ఉద్యోగులకు షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తపాలాశాఖ అభివృద్ధిలో మనమంతా భాగస్వాములమవుతూ శారీరక, మానసిక వికాసం కోసం క్రీడలు ఆడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్క ఉద్యోగి విధినిర్వహణతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. తపాలా శాఖలో ఉన్న ఎంతోమంది ఉద్యోగులు జిల్లా, రాష్ట్ర జాతీయస్థాయిలో వివిధ క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా క్రీడల పట్ల మీతో పాటూ పట్టణాల్లో, గ్రామాల్లో ఉన్న యువతలో ఆసక్తి పెంచాలని సూచించారు. సాయంత్రం అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ ఐ.మురళి ఆధ్వర్యంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాన విజేతలకు సూపరింటెండెంట్ బాబూరావు బహుమతులు ప్రదానం చేశారు.

అవగాహనతోనే ప్రమాదాలకు అడ్డుకట్ట

- అగ్నిమాపక శాఖ అధికారి ప్రభాకరరావు



హెచ్‌పీ గ్యాస్ గొడౌన్ వద్ద అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పార్వతీపురం రూరల్: అవగాహనతోనే అగ్నిప్రమాదాలను అరికట్టవచ్చునని పార్వతీపురం అగ్నిమాపక శాఖ అధికారి జి. ప్రభాకరరావు అన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పార్వతీపురం పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ గొడౌన్ వద్ద సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసే సిబ్బందికి పలు సూచనలు చేసి అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేసేటప్పుడు, రవాణా చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షుణ్ణంగా వివరించారు. సిలిండర్ ద్వారా గ్యాస్ లీక్ అయ్యిందని గమనిస్తే తక్షణమే అప్రమత్తతో తీసుకోవాల్సిన చర్యలపై మాక్‌డ్రిల్ చేసి వివరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పార్వతీపురం అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



కృష్ణారావు

సాలూరు: సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా కృష్ణారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇన్‌చార్జ్ కమిషనర్‌గా మున్సిపల్ డీఈ ప్రసాద్ వ్యవహరించిన సంగతి పాఠకులకు విదితమే. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కృష్ణారావుకు కార్యాలయం సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

21న మోడల్‌స్కూల్ ప్రవేశపరీక్ష

సాలూరు: మండలంలోని పురోహితునివలస ఆదర్శపాఠశాలలో 2025–26 విద్యాసంవత్సరం ఆరవతరగతిలో ప్రవేశాలకు ఈ నెల 21న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ అంజలీదేవి తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఉదయం 8 గంటలకు పరీక్షాకేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఏమైనా సందేహాలుంటే ఫోన్ 9885569242, 9121573367, 7032996552 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

నిబంధలనల మేరకే ప్రయాణికులను ఎక్కించాలి



మాట్లాడుతున్న ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: ఎస్పీ ఆదేశాలమేరకు సర్వీసు ఆటోల్లో నిబంధనలకు మించి ప్రయాణికులను ఎక్కిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎం. రాజేష్ అన్నారు. ఈ మేరకు స్థానిక హనుమాన్ జంక్షన్ ఆవరణలో ఆటోడ్రైవర్లు, ఇతర వాహనాల డ్రైవర్లకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ముందు జాగ్రత్తచర్యల్లో భాగంగా అజ్జాడ, బొబ్బిలి, చినభోగిలి సెంటర్‌లో ఉన్న ఆటోడ్రైవర్లు ప్రయాణికులను తరలించడంలో నిబంధనలు పాటించాలని కోరారు. అధిక లోడుతో ప్రయాణిస్తే చర్యలు తప్పవని, ఈ మేరకు డ్రైవర్లందరూ అవగాహన కల్పించుకోవాలని కోరారు.

అగ్నిప్రమాదాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



అగ్నిప్రమాదాల నివారణపై ప్రయోగాత్మకంగా వివరిస్తున్న అగ్నిమాపక శాఖాధికారి రాజారావు

సాలూరు: అగ్నిప్రమాదాలు సంభవించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపకశాఖాధికారి రాజారావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని పెట్రోల్‌బంక్ వద్ద అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవికాలంలో అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బంకులో ఏ విధంగా అగ్నిప్రమాదాలు సంభవించవచ్చో? వాటి నివారణ చర్యలు తదితర అంశాలపై సిబ్బందికి ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కోనపోలమ్మ ఆలయ ప్రతిష్ట



ఆలయ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరైన మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర, మావుడి సోదరులు

- హాజరైన మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర, మావుడి సోదరులు

మక్కువ:

మండలంలోని కోన గ్రామంలో శుక్రవారం గ్రామదేవత పోలమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రతిష్ట కార్యక్రమానికి మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు హాజరై పోలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రతిష్టకు హాజరైన రాజన్నదొర, మావుడి సోదరులను గ్రామప్రజలు ఘనంగా స్వాగతించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



మక్కువలో గుడ్ ఫ్రైడే జరుపుకుంటున్న క్రైస్తవ సోదరులు



సీతానగరం: పెదభోగిలి లూథరన్‌చర్చిలో వాక్యాన్ని వినిపిస్తున్న ఫాదర్ డేవిడ్‌రాజు



బలిజిపేట నుంచి వెంగాపురం చర్చి వరకు శిలువను తీసుకువెళ్తున్న క్రైస్తవ భక్తులు



సాలూరు: ధూళిభద్రలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా నిర్వహిస్తున్న ప్రార్థనలు



సాలూరు: పట్టణంలో నిర్వహిస్తున్న గుడ్‌ఫ్రైడే కార్యక్రమం

సీతానగరం: గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని సీతానగరం ఆర్‌సీఎం చర్చి ఫాదర్ వర్గీస్,నవీన్ ఆధ్వర్యంలో 14 గ్రామాల సంఘస్తులందరూ హోలీక్రాస్ స్కూల్ నుంచి ఆర్‌సీఎం చర్చివరకూ ఏసుక్రీస్తు శిలువ వేషధారణలో ర్యాలీ నిర్వహిస్తూ ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు డి దేవదానం, కురమాన శ్రీనివాసరావు, దేవత రామారావు, రవీంద్ర అడవయ్య మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేటలో..

బలిజిపేట: గుడ్ ఫ్రైడే సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు శుక్రవారం నిర్వహించారు. అందులో భాగంగా వెంగాపురం విచారణ చర్చి ఫాదర్ కె.ఆనంద్, బ్రదర్ దేవరాజ్‌ల ఆధ్వర్యంలో వెంగాపురం, తుమరాడ, పలగర, బలిజిపేట, చిలకలపల్లి, పదమాయవలస, పెదపెంకి, తదితర గ్రామాలకు చెందిన భక్తులు శిలువను మోస్తూ యేసు గురించి వివరిస్తూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పెదపెంకి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ జోసఫ్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. యేసు క్రీస్తును శిలువ వేసిన సందర్భంలో ఆయన పలికిన 7మాటలను గొప్ప సూక్తులుగా చెప్పుకుంటూ గుడ్ ఫ్రైడేను జరుపుకున్నారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు

- తరచూ రోడ్డు ప్రమాదాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ఆక్రమణకు గురవుతున్న గుమిడివరం మెటల్‌రోడ్డు



జాతీయరహదారిలో ఆర్ వెంకంపేట-అనంతరాయుడుపేట జంక్షన్ మధ్య గోతులు



లచ్చయ్యపేట వద్ద కోతకు గురైన రోడ్డు



ప్రమాదకరంగా మెటల్‌రోడ్డుపై గోతులు



బీటీ రోడ్డును ఆనుకుని ఉన్నగోతులు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో జాతీయరహదారి అధ్వానంగా ఉన్నందున తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఒడిశా మీదుగా విశాఖ వైపు నిరంతరం వందలాది వాహనాలు తిరుగాడే జాతీయరహదారిపై సీతానగరం నుంచి లచ్చయ్యపేట వరకూ గోతులు ఏర్పడడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

అదే సమయంలో మండలంలోని అంటిపేట–పాత బొబ్బిలి ప్రాంతాల మధ్య బీటీ రోడ్డుకు ఇరువైపులా ప్రమాదాలకు నిలయంగా గోతులు వారడం వల్ల వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల అనంతరం రామవరం మీదుగా గుమ్మిడివరం వరకు ఉన్న మెటల్ రోడ్డును బీటీరోడ్డుగా మార్చనున్నట్లు పాలకులు హామీ ఇచ్చారు. ఏడాది కావస్తున్నా రోడ్డు విషయమై పట్టించుకోలేదని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. అలాగే ఆర్ వెంకంపేట– అనంతరాయుడుపేట జంక్షన్‌లో వద్ద తరచూ రోడ్డుపై ప్రమాదాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.